వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 11: ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్యాకేంద్రమైన ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే పీజీ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ తదితర కోర్సుల మొదటి, రెండో సంవత్సరం పరీక్షలను వచ్చే నెల 10 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

దుండిగల్, జూన్ 11: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొలన్‌శ్రీనివాస్‌రెడ్డి (కేఎస్ఆర్) మంగళవారం నర్సాపూర్‌లోని శ్రీచాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి వారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వామివారి కృపాకటాక్షంతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని అభిలాషించారు.

– నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్‌లకు చెందిన ప్రజలు మంగళవారం కొలన్ శ్రీనివాస్‌రెడ్డి(కేఎస్ఆర్)ని నిజాంపేట్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి తమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను వివరించారు.

కండ్లకోయ మత్స్య కార్మిక సంఘం నూతన కమిటీ

మేడ్చల్ రూరల్, జూన్ 11: గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని కండ్లకోయ గ్రామ మత్స్య కార్మిక సంఘం నూతన కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కమిటీ అధ్యక్షుడుగా శ్రీకాంత్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడుగా శివ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్ ముదిరాజ్‌తో సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు రాజేందర్, వెంకటేష్, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు భరోసా సీఎం సహాయ నిధి

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


సీఎం సహాయనిధి ఆర్థిక సాయం నిధుల మంజూరు పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, జూన్ 11 : సీఎం సహాయ నిధి పథకం పేదల ఆరోగ్యానికి ఎంతో అండగా నిలుస్తున్నదని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఈ సాయంతో పేదలు సైతం కార్పొరేట్ దవాఖానలలో ఉచితంగా వైద్య సాయం పొందే వీలు కలుగుతుందన్నారు. కూకట్‌పల్లి డివిజన్ ఆస్బెస్టాస్ కాలనీకి చెందిన బేవర మాన్వితకు అత్యవసర వైద్య సేవల నిమిత్తం సీఎం సహాయ నిధి పథకం కింద రూ.లక్ష ఆర్థిక సాయం నిధుల మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మంగళవారం తన నివాసంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరికంతోపాటు అనారోగ్యాల బారిన పడుతున్న వారెవరూ వైద్యానికి దూరం కావొద్దన్నది ఈ పథకం ప్రధాన లక్ష్యమన్నారు. తగు ఆర్థిక సాయాన్ని అందిస్తూ మెరుగైన వైద్య సేవల ద్వారా అనారోగ్యాలను నయం చేసుకోవచ్చని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. సీఎం సహాయనిధి తన నిరంతర సేవల ద్వారా పేదలకు అండగా నిలుస్తున్నదని, సద్వినియోగం చేసుకుని ఎందరో పేదలు తమ అనారోగ్యాలను దూరం చేసుకుని తమ జీవనోపాధులను కొనసాగించుకుంటున్నారన్నారు. దరఖాస్తుదారులకు వీలైనంత త్వరగా సాయం అందేలా తాను కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంబశివరావు, శ్రీనివాస్, రవిశంకర్, శ్రీజ్యోతి పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

శేరిలింగంపల్లి, జూన్ 11: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నేతాజీనగర్ కాలనీ శ్రీసాయి బాబా దేవాలయం 14 వార్షికోత్సవానికి మంగళవారం శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేశారు. వార్షికోత్సవ ప్రత్యేక పూజల్లో భాగంగా శ్రీరుద్రసహిత చండీయాగం నిర్వహించారు. అర్చకులు జ్యోతి రాడవేంద్ర శర్మ, హిమాలయ తపస్వీ సిద్ధయోగిలతోపాటు పలువురు కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీవాసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి నిధులివ్వండి

మేయర్ విజయలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్

మియాపూర్, జూన్ 11: ఆల్విన్ కాలనీ డివిజన్ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ మేయర్ విజయలక్ష్మిని కోరారు. ఈ మేరకు మేయర్‌ను ఆమె కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని వినతి పత్రం సమర్పించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో వాంబె కాలనీ అతి పెద్దదని, మట్టి కుప్పలు పేరుకుపోయి నివాసితులకు తీవ్ర అసౌకర్యంగా ఉందని కార్పొరేటర్ పేర్కొన్నారు. పెద్దఎత్తున ఉన్న మట్టి కుప్పలను ఎత్తించడంతో పాటు కాలనీని మౌలిక వసతుల పరంగా అభివృద్ధి పరిచేందుకు నిధులను మంజూరు చేయాలని కోరారు. తన వినతి పట్ల మేయర్ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, పాండు గౌడ్, పోశెట్టిగౌడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

– డివిజన్ పరిధిలోని తులసీనగర్‌లో కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో రూ.20లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణాలను నాణ్యతతో సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. డివిజన్‌లోని కాలనీల్లో మౌలిక వసతులను కల్పిస్తామని హామీ ఇచ్చారు.

వర్షం నీటి కాలువల్లో వ్యర్థాలు వేయరాదు

మూసాపేట సర్కిల్ రామారావునగర్ నాళా కల్వర్టు వద్ద ఏర్పాటు చేసిన ఇనుపజాలి

జడ్సీ అభిలాష

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 11: వర్షంనీటి కాలువల్లో చెత్తాచెదారం, వ్యర్థాలు వేయరాదని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అన్నారు. మూసాపేట సర్కిల్ పరిధిలోని రామారావునగర్, యూసఫ్‌నగర్ కాలనీలలో వర్షంనీటి నాళాల కల్వర్టుల వద్ద ఇనుప జాలీలను ఏర్పాటు చేయడం వల్ల...వర్షం నీటి కాలువలో వచ్చే ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వస్తువులను ఎప్పటికప్పుడు తొలగించడానికి వీలవుతుందన్నారు. ఇదే తరహాలో ప్రతి వర్షంనీటి నాళా వద్ద ప్రత్యేకంగా ఇనుప జాలీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వర్షంనీటి కాలువల పరిసర ప్రాంతాలలో నివసించే ప్రజలు ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వస్తువులను నాళాలలో వేయడం మానుకోవాలని, ఇలా చేయడం వల్ల నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడి లోతట్టు ప్రాంతాలలో ముంపు సమస్యలు తలెత్తుతాయన్నారు. కాలనీలు, బస్తీల్లో తిరిగే స్వచ్ఛ ఆటోలలో వ్యర్థాలను వేయాలని ప్రజలను కోరారు. వర్షాకాలం నేపథ్యంలో కొత్తగా సెల్లార్ తీయడాన్ని నిషేధించడం జరిగిందని, ఇప్పటికే తీసినటువంటి సెల్లార్‌లలో ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాత సెల్లార్‌లోకి వర్షంనీరు చేరకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా ముంపు సమస్యలు ఎదురైతే జీహెచ్ ఎంసీ అత్యవసర బృందాల సేవలను ఉపయోగించుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణను కలిసి సమస్యలు తెలియజేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

దుండిగల్, జూన్ 11: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు మంగళవారం కృష్ణను శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి తమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించుకుందాం

గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న డీసీ మల్లారెడ్డి

కుత్బుల్లాపూర్, జూన్ 11: సమష్టిగా ఉంటూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని గాజులరామారం ఉప కమిషనర్ మల్లారెడ్డి అన్నారు. మంగళవారం గాజులరామారం సర్కిల్ పరిధిలోని ఆయా డివిజన్ల కార్పొరేటర్, పార్టీ శ్రేణులతో కలిసి డివిజన్లలో నెలకొన్న ప్రధాన సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా డీసీ మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతోపాటు అంతర్గత అభివృద్ధిని సాధించేలా ప్రతిఒక్కరి సహకారం అవసరమన్నారు. ఆ దిశగా ప్రజాప్రతినిధులు, పార్టీల శ్రేణులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు. స్థానిక సమస్యలపై నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, కొలుకుల జగన్‌తో పాటు ఆయా పార్టీల శ్రేణులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మోష్ పబ్ కేసులో 8 మంది అరెస్ట్

మాదాపూర్, జూన్11: మాదాపూర్ లోని మోష్ పబ్ కేసులో యాజమాన్యంతో పాటు 8 మందిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఈవెంట్ చేస్తామని వచ్చి యాజమాన్యానికి తెలియకుండా గ్యాంగ్ దందా నడిపిస్తున్నట్లు పలువురు తెలిపారు. డేటింగ్ యాప్‌ల ద్వారా యువతులతో వలపు వల వేస్తూ యువ వ్యాపారవేత్తలతోపాటు పలువురిని పబ్బుకు రప్పించి వేల రూపాయల బిల్లులు బాధితులకు అంటగడుతున్నట్లు తెలిపారు. డేటింగ్ యాప్ ద్వారా మోసాలకు పాల్పడుతున్న ఢిల్లీకి చెందిన 8 మంది గ్యాంగ్‌ను అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఇదిలాఉండగా పోలీసులు మాత్రం ఈ కేసుకు సంబంధించి ఎవరిని అరెస్ట్ చేయలేదని చెబుతున్నారు.

కుత్బుల్లాపూర్‌లో వాహనాల తనిఖీ

- డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు
- ఇద్దరు నిందితుల అరెస్టు.. రూ.2 లక్షల విలువ చేసే డ్రగ్స్ సీజ్



నిందితులతో పాటు డ్రగ్స్‌ను చూపుతున్న మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు

కుత్బుల్లాపూర్, జూన్11 : కుత్బుల్లాపూర్‌లో మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తుండగా.. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ స్కూటీపై ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని ప్రశ్నించగా సరైన సమాధానాలు చెప్పకపోవడంతో వాహనాన్ని తనిఖీ చేయగా.. సుమారు రూ.2 లక్షల విలువ చేసే డ్రగ్స్ బయటపడిన సంఘటన మంగళవారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. మేడ్చల్ పరిధి గండిమైసమ్మ ప్రాంతంలో డ్రగ్స్‌ను అమ్ముతున్నారని వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు డీపీ ఈఓ షేక్ పతియాజోద్దీన్, ఎఈఓ కె.మాధవయ్య, డీటీఎఫ్ సీఐ నర్సిరెడ్డి ఆదేశాల మేరకు ఎక్సైజ్ డీటీఎఫ్ పోలీసులు రంగంలోకి దిగి గండిమైసమ్మ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో ద్విచక్ర వాహనాన్ని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా.. టూల్స్‌బాక్స్‌లో లభించిన ఎండీఎంఎ రకమైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించినట్లు డీటీఎఫ్ ఎస్ఐ పవన్‌రెడ్డి తెలిపారు. బెంగళూరు నుంచి కిరణ్ అనే వ్యక్తి హైదరాబాద్‌కు వచ్చి డ్రగ్స్‌ను క్రాంతి, మహ్మద్ షోయల్‌కు ఇచ్చాడని తెలిపారు. ఈ డ్రగ్స్‌ను అమ్మకానికి తీసుకెళ్తుండగా.. వారి వద్ద రూ.2 లక్షల విలువ చేసే 21 గ్రాముల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడిలో ఏసీ వెంకటేశ్వర్‌రావు, కానిస్టేబుల్స్ చెన్నయ్య, శ్రీనివాస్, జ్యోతి బృందాలు చాకచక్యంగా డ్రగ్స్‌ను పట్టుకోవడం పట్ల వారిని ఎక్సైజ్ కమిషనర్ ఇ.శ్రీధర్‌తోపాటు ఉన్నతాధికారులు అభినందించారు.

దండమూడి శోభనాద్రికి ఘన నివాళి

కేపీహెచ్‌బీ కాలనీ మాజీ కార్పొరేటర్ దండమూడి శోభనాద్రికి పలువురు ఘన నివాళులర్పించారు. మంగళవారం కేపీహెచ్‌బీ కాలనీ జేఎన్‌టీయూహెచ్ చౌరస్తాలో శోభనాద్రి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు మజ్జిగ, ఆహారం ప్యాకెట్లను పంపిణీ చేశారు. కేపీహెచ్‌బీ కాలనీ కార్పొరేటర్‌గా శోభనాద్రి అందించిన సేవలు మరువలేనివని, ఆయన ఆశయాలను సాధించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో శోభనాద్రి అభిమాన సంఘం నాయకులు అట్లూరి దీపక్, ఎస్‌కె సత్తార్, చందర్‌రావు, జాస్తీ రమాదేవి, ఉమ, సుబ్బారావు, రవి, శ్రీనివాస్, గోపికృష్ణ, పవన్, ఆర్‌కె.చౌదరి, హేమంత్, రాయుడు, వివయ్, సురేంద్ర తదితరులున్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 11

ఆగిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

గచ్చిబౌలి డివిజన్‌లో పర్యటించిన జెడ్సీ స్నేహా శబరీష్

గచ్చిబౌలి డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ గంగాధర్ రెడ్డితో కలిసి పర్యటిస్తున్న వెస్ట్‌జోన్ కమిషనర్ స్నేహా శబరీష్

శేరిలింగంపల్లి, జూన్ 11: జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ కమిషనర్ స్నేహా శబరీష్ శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని గచ్చిబౌలి డివిజన్‌లో మంగళవారం స్థానిక కార్పొరేటర్ గంగాధర్ రెడ్డితో కలిసి పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలు, డివిజన్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల విషయంపై పాదయాత్ర నిర్వహించి పరిశీలించారు. డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లితాండ, గోపన్‌పల్లి విలేజ్, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో ఈ సందర్భంగా పర్యటించి సీసీ రోడ్లు, డ్రైనేజీ, మంజీరా పైపులైన్ల ఏర్పాటు అంశాలపై చర్చించారు. ఆయా ప్రాంతాల్లో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి జోనల్ కమిషనర్ స్నేహా శబరీష్‌ను కోరారు. స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆమె సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం శరత్‌కుమార్, శేరిలింగంపల్లి సర్కిల్ ఈఈ శ్రీనివాస్, డీఈ విశాలక్షి, టౌన్‌ప్లానింగ్ అధికారులు రవీందర్, రమేశ్, ఎఎంఓహెచ్ నగేశ్, స్థానిక నాయకులు హనుమంతు నాయక్, రాజు, రమేశ్, నర్సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పద్మబ్రాహ్మణ గ్రేటర్ కార్యదర్శిగా మల్లికార్జున్

పద్మశాలీలు ఆధ్యాత్మిక, కళారంగాల్లో రాణించడం అభినందనీయమని సంఘం నేతలు అన్నారు. జగద్గిరిగుట్ట శ్రీరాంనగర్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. పౌరోహిత్యంలో సేవలందిస్తూ ఆలయ స్థాపనలు నిర్వహిస్తున్న గడ్డం మల్లికార్జున్‌ని పద్మబ్రాహ్మణ సంఘం గ్రేటర్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. సంఘం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య, రాష్ట్ర ప్రధానకార్యదర్శి వడిచెర్ల మారుతి, వెంకటేశం, అశోక్, శ్రీనివాస్, దామోదర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

– జగద్గిరిగుట్ట, జూన్ 11

వర్షాకాలంలో చేపట్టే సహాయక చర్యలపై సమీక్ష

అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న కమిషనర్ కె.సత్యనారాయణ, తదితరులు

దుండిగల్, జూన్ 11: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన సహాయక చర్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని దుండిగల్ మున్సిపాలిటీ కమిషనర్ కె.సత్యనారాయణ సూచించారు. మంగళవారం దుండిగల్ మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పలు సూచనలు, సలహాలు అధికారులకు, సిబ్బందికి సూచించారు. వర్షాకాలంలో తలెత్తే వరదలు, పారిశుద్ధ్యం నిర్వహణ, సీజనల్ వ్యాధుల నివారణ, కంట్రోల్ రూమ్ ఏర్పాటు, అవసరమైన మిషనరీతో అత్యవసర యంత్రాంగం ఏర్పాటు వంటి ముందస్తు చర్యలపై చర్చించారు. ప్రజలకు వర్షాలకు తలెత్తే సమస్యలపై అత్యవసర మొబైల్ నంబర్ 95427 15377కు డయల్ ద్వారా కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ ప్రవీణ్‌కుమార్, మేనేజర్ నర్సింహులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, వార్డు ఆఫీసర్లు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి స్థలం విషయంలో వివాదం..

ఇరువర్గాలకు చెందిన 10 మందిపై కేసు నమోదు

దుండిగల్, జూన్ 11: ఇంటి స్థల వివాదంలో గొడవపడి కొట్టుకున్న ఇరు వర్గాలకు చెందిన మహిళలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్‌నగర్ డివిజన్ సూరారంకాలనీ తెలుగుతల్లీనగర్‌కు చెందిన వావిలాల సంధ్యారాణి అనే మహిళ ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో బేస్‌మెంట్ నిర్మిస్తుండటంతో ఆ పక్కనే ఉన్న బోనగాని అపర్ణ అభ్యంతరం తెలిపి, పనులను అడ్డుకుంది. దీంతో ఇరువర్గాల మధ్య మాట పెరిగి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో ఇరు కుటుంబాలకు చెందిన వారు స్ట్రీట్‌ఫైట్‌కు దిగి ఒకరిపై ఒకరు పరస్పరం కొట్టుకున్నారు. ఇరువర్గాల మధ్య తరచూ ఇటువంటి సంఘటనలు జరుగుతుండటంతో స్థానికులు 100కు డయల్ చేసి చెప్పగా, వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారించి ఇరు వర్గాలకు చెందిన వివాలాల శైలజ, వావిలాల ధరణి, వావిలాల యమున, వావిలాల అక్షిత, వావిలాల సంధ్యారాణి, చక్రితో పాటు బోనగాని అఖిల, బోనగాని అర్జున్‌గౌడ్, బోనగాని అపర్ణ, తక్కెల్లపల్లి అంజలిపై మొత్తం 10 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే శైలజకి సంబంధించిన పుస్తెలతాడును గుంజుకున్న వైరి వర్గం మహిళలు తన వాళ్లను కొట్టినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వావిలాల శైలజ తన సెల్‌ఫోన్ వర్గీయులు లాక్కున్నట్లు ఫిర్యాదు చేసింది. స్థానికులను విచారించగా .. రెండు వర్గాలకు చెందిన మహిళలు ఇక్కడ తరచూ గొడవకు దిగి న్యూసెన్స్ సృష్టిస్తున్నారని తేలింది.

రోడ్డుపై ఉన్న కొమ్మలను తొలగించండి

అల్లాపూర్, జూన్ 11: విద్యుత్ హైటెన్షన్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించడం విద్యుత్ అధికారులు తరుచూ చేపడుతుంటారు. అంతే కాకుండా అకాల వర్షాలు కురిసినప్పుడు ఈదురు గాలులకు పడిపోయిన చెట్లను పూర్తిగా తొలగించడం జీహెచ్ఎంసీ డీఆర్‌యూఎఫ్ సిబ్బంది చేపడుతుంటారు. గాయత్రినగర్‌లో కొన్నిరోజుల కిందట విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్నాయని చెట్ల కొమ్మలను తొలగించారు. వాటిని తరలించడంలో సిబ్బంది నిర్లక్ష్యం చేపట్టడంతో పాదచారులకు, వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతున్నది. 15 రోజులు గడుస్తున్నా అధికారులు రోడ్లపై అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించకపోవడంతో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై పడిఉన్న చెట్లకొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు మధ్యలో అడ్డంగా పడిఉన్న చెట్లకొమ్మలు

మణికంఠ నాయీబ్రాహ్మణ సేవా సంఘం లెటర్ ఆవిష్కరణ

నూతనంగా ఎన్నికైన కుత్బుల్లాపూర్ ఓం మణికంఠ నాయీబ్రాహ్మణ సేవా సంఘం లెటర్‌ను మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, జీడిమెట్ల డివిజన్ వార్డు మెంబర్ గంధం సుధాకర్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గడిల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి విఎస్ఆర్.వెంకట్, కోశాధికారి బాలేశ్వర్, సత్తీశ్, రూరల్ చైర్మన్ మైలారం యాదగిరి, స్వామి, గౌరవ అధ్యక్షులు భిక్షపతితోపాటు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

– కుత్బుల్లాపూర్, జూన్ 11

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 11 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో మంగళవారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 47, వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 55, బజ్జి మిర్చి 65, కాకరకాయ 45, బీరకాయ 55, క్యాబేజి 21, ఫ్రెంచ్ బీన్స్ 85, క్యారెట్ 40, కాలీఫ్లవర్ 23, దొండ 23, చిక్కుడు 55, గోరుచిక్కుడు 45, బీట్‌రూట్ 23, క్యాప్సికం 63, ఆలుగడ్డ 35, కీరా 28, దోసకాయ 28, సొరకాయ 11, పొట్లకాయ (1) 18, కందగడ్డ 45, ఉల్లిపొరక 75, ఉల్లిగడ్డ 39, మామిడికాయ(1) 10 నుంచి 15, అరటికాయ(1) 10 నుంచి 12, చామగడ్డ 40, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 35, గుమ్మడికాయ 25, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1) 5 నుంచి 6, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 240, చింతపండు 120, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

సెమీస్‌లోకి ప్రింట్ మీడియా టీమ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: వీ డ్రీమ్స్ బిజ్ టెక్ కార్పొరేట్ క్రికెట్ చాంపియన్‌షిప్‌లో ప్రింట్‌మీడియా సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం స్థానిక విజయానంద్ గ్రౌండ్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ప్రింట్ మీడియా టీమ్ 39 పరుగుల తేడాతో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్ఏటీజీ)పై ఘన విజయం సాధించింది.

తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రింట్ మీడియా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. రవికుమార్(36), రోనిత్ సింగ్(36) మెరుగ్గా రాణించారు. ఫణి కిశోర్ (3/27) మూడు వికెట్లతో ఆకట్టుకున్నాడు. ఆ తర్వాత లక్ష్య ఛేదనకు దిగిన ఎస్ఏటీజీ టీమ్ 7 వికెట్లు కోల్పోయి 147 పరుగులకు పరిమితమైంది. ఓపెనర్ కుమార్ బాబు (54) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. మూడు వికెట్లతో జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన ప్రింట్‌మీడియా ప్లేయర్ రాజశేఖర్(3/18)కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. బుధవారం జరిగే సెమీస్‌లో డాక్టర్స్–11 టీమ్‌తో ప్రింట్‌మీడియా తలపడుతుంది.